# 19

# ప్రేమను ప్రేమించు

"అమ్మా నువ్వంటే నాకు గౌరవం.. ఇష్టం. నువ్వు నమ్మిన దానికోసం ప్రపంచాన్నే ఎదిరించగలిగే నీ వ్యక్తిత్వం నాకాదర్శం. కన్న తల్లిని నేనిలా ప్రశ్నించకూడదు. కానీ ఇరవై సంవత్సరాల క్రిందట నిన్ను నాన్న పెళ్ళిచేసుకున్నప్పుడు నీకున్నదేమిటి? ఆస్తా?, అంతస్థా?" నిర్భయంగా తల్లి ముఖంలోకిచూస్తూ అడిగింది సుజనప్రియ.

శార్వరి ముఖం కోపంతో, అవమానంతో కందిపోయింది. 'తనలో భాగంగా పెరిగి, తన చేతుల్లో పెరిగిన బిడ్డేనా? నొప్పిస్తున్నానన్న సంకోచంలేకుండా, తప్పుచేస్తున్నానేమో అన్న భీతి లేకుండా ఎన్ని మాటలు మాట్లాడుతున్నది?" అనుకుంటుంటే ఆమెలో ఆవేశం రగిలింది.

"ఆపు సుజనా.. నువ్వు నా అంచనాలకు మించి ఎదిగిపోయావు.. తల్లిననే గౌరవం, ప్రేమ వుంటే ఇన్ని మాటలు మాట్లాడుతావా? ఆఫ్ట్రాల్ ఒక గుమాస్తాగాడి కోసం, రెక్కాడితేగానీడొక్క నిండని నిర్భాగ్యుడి కోసం.." ఆయాసపడింది శార్వరి.

"అమ్మా" మృదువుగా వుంది సుజనప్రియ గొంతు. "అవును.. అతను ఆఫ్టరాల్ ఒక గుమాస్తాయే... నిర్భాగ్యుడే.. కానీ అతన్ని నేను ప్రేమిస్తున్నాను. నాన్న నిన్ను ఎందుకోసం ప్రేమించారో, తనవారినందర్నీ ఎదిరించి నీ చేయి అందుకున్నారో అందుకే నేనూ అతన్ని కోరుకుంటున్నాను."

"దౌర్భాగ్యురాలా! మీ నాన్నకు అతనికి హస్తిమశకాంతరం వుంది. ఆయన నన్ను అరచేతిలో పువ్వులా చూసుకున్నారు. మహారాణీ భోగాలు సమకూర్చారు. ఏనాడూ నా మనసు నొప్పించి ఎరుగరు. అటువంటి మనిషికీ భాగ్యవంతుల బిడ్డను వలలో వేసుకుని ఖరీదైన జీవితాన్ని కొనుక్కోవాలనుకుంటున్న ఈ అల్పునికీ పోలికా?" తీవ్రంగా చూస్తూ కోపంగా అడిగింది శార్వరి.

సుజనప్రియ మనోహరంగా నవ్వింది. 'ఎంత పిచ్చిదానివమ్మా?' అన్నట్టుగా వుంది ఆ నవ్వు.

"నన్ను మన్నించు అమ్మా. కానీ భాగ్యవంతుడనే కారణంగానే నాన్నగారికి

మనసిచ్చేవామ్మా? వారానికి రెండు రోజులు ఆకలి కడుపుతో పస్తులు పడుకునే వాళ్ళమని నీ గురించి ఎన్నోసార్లు చెప్పావు. నీతో పోలిస్తే అప్పట్లో నాన్న ధనవంతుడే మరి... మూరెడు మల్లెపూల దండకోసం, రంగు వెలవని ఓణీకోసం తపించిపోయేదానివని చెప్పావు. ప్రపంచంలో ఏ సుఖమూ నీ బిడ్డలకు అందకుండా పోకూడదని, వారికి బంగారు భవిష్యత్తునివ్వాలని ఆశించి మనసు చంపుకుని నాన్నను విదేశాలకు పంపి రెండేళ్ళు కన్నీళ్ళే ఆహారంగా బ్రతికావు. నా జీవితమూ, చదువూ, సంస్కారం అన్నీ నువ్వు పెట్టిన భిక్షే.. కాదనను.. కానీ శరీరానికి, బుద్ధికి కావల్సినవి అన్నీ ఇచ్చి మనసును మాత్రం మసిచేస్తావా అమ్మా?" గాద్గదికంగా వణికింది సుజనప్రియ గొంతు.

కఠిన శిలాప్రతిమలా చలనంలేకుండా కూర్చుండిపోయింది శార్వరి. కూతురివైపు చూడటం కూడా ఇష్టంలేనట్టు ముఖం పక్కకు తిప్పుకుంది.

"మీరేం మాట్లాడరేం నాన్నా? మీరైనా నా మనసు గ్రహించలేరా?" మౌనవ్రతం పట్టిన వాడిలా కూర్చున్న భార్గవ వైపు జాలిగా చూసింది సుజన.

చెమ్మగిల్లిన కళ్ళను ఆపిల్ల చూడకూడదన్నట్టు నేలవైపు చూస్తూ వుండిపోయాడు భార్గవ.

"నామాటే ఆయన మాటకూడా... ఏనాడైనా నా ఇష్టాన్ని ఆయన కాదనగా ఎరుగుదువా? తల్లితండ్రుల పట్ల గౌరవాభిమానాలు వున్నా లేకపోయినా కనీసం కృతజ్ఞతనేది వున్నా అతనిని గురించి మరొకసారి మాట్లాడకు సుజనా. లేదు మాకంటే నీకు అతడే ముఖ్యుడని అనుకుంటే మా మనసుల్లో జీవితంలో నీకు చోటువుండదు. నువ్వే ఆలోచించి నిర్ణయించుకో..." పట్టుదలగా చెప్పి అక్కడి నుండి లేచి వెళ్ళిపోయింది శార్వరి.

ఎండవేడిసోకి వాడిపోయిన కలువ పువ్వులా వుంది సుజనప్రియ ముఖం. కనుగొలుకులలో నిల్చిన కన్నీటి బొట్లు ఇక ఆగలేమన్నట్లుగా చెక్కిళ్ళమీదికి జారేయి.

గుండెకోసి చూసి దుష్టాంగాన్ని ఛేదించిపారేసి మనిషి బ్రతుకును బాగుచేయగల ఆమెచేతులు దుఃఖభారంతో ఎగసిపడుతున్న తన గుండె బరువును తగ్గించడానికి అన్నట్టు గుండెమీదచేరాయి.

ఎఱ్ఱబడిన కనులెత్తి తండ్రివైపు చూసింది సుజన. తల్లి క్రమశిక్షణను పట్టుదలను నూరిపోస్తే ప్రేమ చూపి ప్రేమించడం నేర్పిన ఆ తండ్రి మౌనముద్ర వీడలేదు.

నెమ్మదిగా లేచి సుజనప్రియ దగ్గరగా వచ్చి ఆమె తలమీద చేయివేసి నిమిరి క్షణకాలం ఆర్తినిండిన ఆ కన్నులలోకి చూసి అంతలోనే ముడిపడుతున్న చూపులను విడదీసుకుంటూ లోపలికి నడిచాడు భార్గవ.

క్షణం తర్వాత చిన్నగా నిట్టూర్చి, లేచి తన గదివైపు కదిలింది సుజనప్రియ ఇపుడాపిల్ల కళ్ళలో కన్నీళ్ళు లేవు. దృఢ నిశ్చయం, తెగింపు వున్నాయి.

* * *

పక్షులు మేలుకొలుపు పాడి లోకాన్ని నిదురలేపేవేళ... గాలి అలిసిపోయి చలిని కౌగిలించుకుని నిదురించే వేళ. జగతి ఆదమరచి విశ్రాంతిలో మునిగే ప్రభాత ప్రత్యూష వేళలో చేతిలో చిన్న సూట్‌కేస్‌తో బయటకు అడుగు పెట్టింది సుజనప్రియ.

చప్పుడు కాకుండా తలుపు దగ్గరిగావేసి పయిటకొంగు తలమీదుగా కప్పుకుని గబగబ ముందుకు నడిచింది.

మలుపులో నిలబడివున్న మబ్బుతునకలాడి కారు ఫ్రంట్ డోరు తెరుచుకుని దిగి సుజన కెదురుగా నిలబడ్డాడు భార్గవ.

"నాన్నా..." తండ్రిని అల్లుకుపోయింది సుజన.

ఆమెచేతిలోని సూట్‌కేస్ కార్లోపెట్టి సుజన వెనక సీట్లో ఎక్కి కూర్చున్నాక కారు స్టార్ట్‌చేసి 'ఎటువైపు?' అనడిగాడు భార్గవ. సుజన చెప్పిన మార్గాన కారు కదిలింది.

"అప్పుడే నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోతారా నాన్నా?" భార్గవ చేయిపట్టుకుని పసిపిల్లలా మారాం చేసింది సుజన.

సుజన పక్కన నిలబడిన యువకుడివైపు చూసి చిరునవ్వు నవ్వేడు భార్గవ. మృదువుగా సుజన చేతిని విడిపించుకున్నాడు. "ఈ వారం రోజులకే మీ అమ్మ దిగులుపడి మంచమెక్కి వుంటుంది. నేను దగ్గరలేనిదే తను మామూలు మనిషి కాలేదు." తగ్గు స్వరంలో అన్నాడు భార్గవ. "నీకు అతను కావాలి నాకు మీ అమ్మ కావాలి." కూతురివైపు చూసి నవ్వాడు. అతడి నుండి చూపులతోనే వీడ్కోలు తీసుకుని ముందుకు నడిచాడు.

"మీకు మీ కూతురు ముఖ్యం.. దాని సంతోషం ముఖ్యం... ఎందుకొచ్చారసలు? అక్కడే వుండిపోవలసింది. నా బాధ మీకు లెక్కలేదు. ఎన్ని కలలు కన్నాను దాని గురించి? నేను దానికి శత్రువును. మీరు దాని ఆప్తులు. నాతో మాట్లాడకండి. నన్ను ముట్టుకోకండి ఇక్కడి నుండి వెళ్ళిపోండి ముందు. నా మనసును ముక్కలుచేసి, ఆశలు కాలరాచి ఇంకా ఏముందని నా దగ్గరికి వచ్చారు? "హిస్టరికల్‌గా ఏడుస్తుంది శార్వరి.

విదిలించివేస్తున్నా, కసరి కొడుతున్నా వదలకుండా ఆమెను కౌగిలిలోనుండి కదలనివ్వలేదు భార్గవ.

"శారూ ప్రేమించిన మనసునీది. ఆ ప్రేమను ఆస్వాదించిన మనిషిని నేను. ఎందుకీ ఆవేశం? దేనికోసం ఈ ఆరాటం నీకు? మనం పొందిన తృప్తికీ సంతోషానికీ కారణం మన ప్రేమ. దాన్ని పాపకు దూరం చేస్తావా పిచ్చీ? చిన్న తనాన తల్లి కాపలా. వయసున వలచిన వాడు కాపలా.. ఎవరి ప్రేమకు నోచనివేళ కన్నీరేరా నీకు కాపలా అనేపాట వింటేనే కన్నీళ్ళు నింపే నువ్వు సుజన కన్నీళ్ళు చూడగలవా?" ఆర్ద్రంగా పలికాడు – భార్గవ.

తలెత్తి అతని కళ్ళలోకి చూసింది శార్వరి. ఆ కన్నుల్లో భావాన్ని వెదికాడు భార్గవ. శార్వరి కళ్ళు మూసుకుని అతని హృదయం మీద తలవాల్చి నిశ్శబ్దంగా

వుండి పోయింది కొద్దిసేపు.

మృదువుగా ఆమె కళ్ళు తుడిచాడు భార్గవ. ఆ చేతిని అలాగే చెక్కిలిమీద నొక్కి పట్టుకుంటూ "వాళ్ళిద్దరినీ ఇంటికి తీసుకురండి" అంది శార్వరి మార్దవంగా.

భార్గవ కళ్ళు కాంతివంతమయ్యాయి. "నీ మనసు నాకు తెలుసు శారూ... మనసునూ, బ్రతుకును పంచుకోవాలనుకున్న మనిషి కోసం సుజన మనల్ని కాదనకుందన్న బాధను మరిచిపోయి ఆలోచిస్తే దాని నిర్ణయం ఒక విధంగా మన విజయం.." భార్గవ నవ్వుతూ అన్నాడు.

అర్థంకానట్టు చూసింది శార్వరి.

"అది ప్రేమ విజయం పిచ్చీ... ఇరవై ఏళ్ళ క్రిందట నువ్వూ నేను నడిచిన బాటలోనే ఇవాళ సుజన ప్రయాణమయింది అయితే మన తల్లితండ్రుల్లా కాకుండా మనం సుజనను ఆశీర్వదిస్తున్నామంటే మన ప్రేమ మనకు ప్రేమను ప్రేమించడం నేర్పిందన్నమాట." శార్వరి కనులలోకి చూస్తూ నెమ్మదిగా అన్నాడు భార్గవ.

స్నిగ్ధంగా నవ్వి భార్గవ గుండెలో తలదాచుకుంది శార్వరి. ●